
సాక్షి
బాపట్ల
బుధవారం । 13 । మార్చి । 2024



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6500, గరిష్ట ధర రూ.8100, మోడల్ ధర రూ.7200 వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 514.00 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



బెల్లంకొండ: కొండపై ప్రతిష్టించిన వేంకటేశ్వరునికి మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతిష్ట జరిగి 16 రోజులు పూర్తయిన సందర్భంగా పూజలు చేసినట్టు ఆలయ కమిటీ వెల్లడించింది.




రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహరి (గురు)
బాపట్ల	6.23	5.01
గుంటూరు	6.23	5.01
చిలకలూరిపేట	6.26	5.01

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట సమన్వయకర్తగా కావటి



సాక్షి, నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా కావటి మనోహర్ నాయుడుని నియమిస్తున్నట్టు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. కావటి మనోహర్ నాయుడు ప్రస్తుతం గుంటూరు నగరపాలక సంస్థ మేయర్‌గా ఉన్నారు. గతంలో పెదకూరపాడు నియోజకవర్గ సమన్వయకర్తగా కూడా పనిచేశారు.

రేపు జాబ్ మేళా

లక్ష్మీపురం: గుంటూరు జిల్లా ఉపాధి కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 2 గంటల వరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి కె.రఘు మంగళవారం తెలిపారు. జిల్లా పరిసర ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతి, యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలియజేశారు. గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, కొయా కన్సల్టింగ్, హెటిరో డ్రగ్స్, నియోన్ లెన్స్, మణిపురం, ఆదిత్య బిర్ల క్యాపిటల్స్, ఆరబిందా, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీ సంస్థ వారు ప్రత్యేకంగా ఈ జాబ్ మేళాలో హాజరతారని తెలిపారు. ఈ జాబ్ మేళాకు 10వ తరగతి, ఐటీఐ, ఇంటర్, బి.టెక్, డిగ్రీ, ఎంబిఏ, ఎంసీఏ వరకు విద్యార్హత, 18–35 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతీ యువకులు అర్హులు అని తెలిపారు. అభ్యర్థులు వారి బయోడేటా, రెస్యూమ్, విద్యార్హత, ఆధార్ పత్రాల జిరాక్స్ కాపీలు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూలకు గుజ్జనగుండ్ల సర్కిల్ వద్ద గల జిల్లా ఉపాధి కార్యాలయంకు హాజరు కావల్సిందిగా తెలిపారు. ఇతర వివరాలకు 9652065235, 9052438392 నంబర్లకు సంప్రదించాల్సిందిగా తెలియజేశారు.

పొదుపు, పరపతి సహకార సంఘం అడ్‌హాక్ కమిటీ



నరసరావుపేట: జిల్లా పొదుపు, పరపతి సహకారం సంఘ అడ్‌హాక్ కమిటీని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ నియమించారు. కలెక్టరేట్‌లో కమిటీ చీఫ్ ప్రమోటర్‌గా నియమితులైన డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్‌కు మంగళవారం నియామకపత్రం అందజేశారు. ఈ కమిటీకి కార్యవర్గ సభ్యులుగా డీఆర్వో కె.వినాయకం, ఏపీఎంఐపీ పీడీ ఆంజనేయులు, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రాజానాయక్, ప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ గజ్జల శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ ఇంజనీర్ సుబ్బరాయుడు, మార్కెటింగ్‌శాఖ ఏడీఏ సూర్యప్రకాష్‌రెడ్డి నియమితులయ్యారు.

గతిశక్తి కార్గో టెర్మినల్ ప్రారంభం



దాచేపల్లి: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా గతిశక్తి కార్గో టెర్మినల్ రైలు మార్గాన్ని మంగళవారం ప్రారంభించారు. తుమ్మలచెరువు రైల్వే స్టేషన్ నుంచి పెదగార్లపాడు గ్రామ సమీపంలోని చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ వరకు కార్గో టెర్మినల్ నిర్మించారు. ఢిల్లీ నుంచి వర్చువల్‌గా మోదీ ఈ మార్గాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే డీజీఎం సీహెచ్ ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా పది వందేభారత్ రైళ్లు, గతిశక్తి కార్గో టెర్మినల్స్‌ని ప్రధాని మోదీ ప్రారంభించారని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఈఎన్ టీవీ కృష్ణయ్య, ఏడీఈ ఎల్.శ్రీరాములు, ఫ్యాక్టరీ జాయింట్ ప్రెసిడెంట్ సీహెచ్ సీతారాములు, హెచ్ఆర్ హెడ్ బీబీఆర్ రాజు, లాజిస్టిక్ హెడ్ పీఎస్ ప్రేమ్‌కుమార్, హెచ్ఆర్ మేనేజర్ షేక్ అన్వర్ పాల్గొన్నారు.

సంక్షేమ అజెండా రెపరెపలు

- ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు
- ఊరూవాడా పార్టీ జెండాల ఆవిష్కరణ
- రోగులకు పండ్లు పంపిణీ

నాడు..

స్తబ్ధతకు, అహంకారానికీ
అసమర్థ పాలనకు ప్రతీక..
వైఎస్సార్ మరణంతో.. అహంకార
పాలన కక్షకట్టింది..
అడుగడుగునా అవమానాలు..
ప్రతిపక్షాలతో కలిసి కుట్రలు కుతంత్రాలు..
అధికార కుట్రలను ఎదుర్కొంటూ..
తండ్రి ఆశయాలు నెరవేర్చేందుకు..
ఒంటరిగా మొదలైన ఓదార్పుయాత్ర..
అలా మొదలైన ప్రస్థానం..

నేడు

బక్కచిక్కిన ఎడ్లు వెంటరాగా నాగలి
భుజాన వేసుకుని పొలం వెళ్తున్న రైతుకు
అండగా రైతు భరోసాతో నేనున్నానంటూ..
పండుటాకుల చేయి పట్టుకుని ఆసరాగా..
భారతవనిలో ఎన్నాడూ లేని విధంగా
పేదల సొంతింటి కల నెరవేర్చి..
కాలనీలు నిర్మించి..
చేతివృత్తులకు చేయూతనిస్తూ..
గాంధీజీ స్వప్నం గ్రామ సచివాలయాల్లో
చూపిస్తూ..
కార్పొరేట్ కబంధ హస్తాలలో బందీ అయిన
చదువుల 'సరస్వతి'ని పేదలకు చేరువ చేస్తూ..
పేదలకు కార్పొరేట్ వైద్యంతో ఆరోగ్య రక్ష..
నవరత్నాలతో ఆనందాలు కురిపిస్తూ..
అవ్వాతాతలకు ఇంటి పెద్దకొడుకుగా..
అక్కచెల్లెమ్మలకు అన్నగా..
చిన్నారులకు మేనమామగా..
అన్ని వర్గాలకు అందరించే అన్నయ్యగా..
నేడు లక్షలాది కుటుంబాలు వెంట రాగా
విశ్వసనీయతకు ప్రతీకగా..
సంక్షేమ శిఖరాన వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడుతోంది.. ఊరూవాడా మంగళవారం వైఎస్సార్ సీపీ 14వ ఆవిర్భావ దినోత్సవ సందడి నెలకొంది..



కర్లపాలెంలో కేక్ కట్ చేస్తున్న బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాడవాడల పార్టీ నాయకులు, కార్యకర్తలు వేడుకల్లో పాల్గొన్నారు. రోగులకు పండ్లు పంపిణీ చేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. మహానేత డాక్టరు వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- రేపల్లె నియోజకవర్గంలో పార్టీ కార్యాలయంలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణా రావు, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టరు ఈవూరి గణేష్ జెండా ఆవిష్కరించారు.
- బాపట్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోన రఘుపతి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. స్థానిక రథంబజారు వద్ద కేక్‌లు కట్ చేశారు. మిఠాయిలు పంచి పెట్టారు.
- వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ, కేక్‌లు కట్ చేశారు.
- చీరాల నియోజకవర్గంలో గడియార స్తంభం వద్ద ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి నాయకత్వంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు జెండా ఆవిష్కరించారు. కేక్ కట్ చేశారు.



రేపల్లెలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీ మోపిదేవి, పక్కన సమన్వయకర్త గణేష్

- ఎర్రూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరణ చేశారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు.
- అద్దంకి సమన్వయకర్త పానెం చిన్న హనిమిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. బధిరుల పాఠశాలలో పండ్లు పంపిణీ చేశారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్



ఆదివారం హెలిప్యాడ్ వద్ద చిన హనిమిరెడ్డిని భుజం తట్టి అభినందిస్తున్న సీఎం వైఎస్ జగన్

- సిద్ధం సభ విజయవంతం
- చిన హనిమిరెడ్డిని భుజం తట్టిన సీఎం వైఎస్ జగన్

అద్దంకి: మేదరమెట్ల సమీపంలో నిర్వహించిన సిద్ధం సభ విజయవంతం అయింది. సంక్షేమ రథ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కావడంతో సభకు లక్షలాది మంది తరలివచ్చారు. దారులన్నీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో నిండిపోయాయి. ఆకాశమంత మంది హాజరైనట్లు సందడి నెలకొంది. పిల్లపాపలు, అక్కచెల్లెలు, అవ్వాతాతలు, చేతివృత్తిదారులు, నవరత్నాలతో లబ్ధిపొందిన ప్రతిఒక్కరూ మా జగనన్న చూడాలనే కుతుహలంతో ఉదయం నుంచే సభ ప్రాగంణానికి తరలివచ్చారు. సభకు నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున సభకు హాజరయ్యారు. పెల్లుబికిన జనాభిమాన సంద్రంలో హనిమిరెడ్డి గెలుపు నల్లేరుపై నడకేనని సిద్ధం సభకు వచ్చిన జనాన్ని చూసి రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఫ్యాన్ గుర్తుకే ఓటు అంటూ..

సిద్ధం సభకు వచ్చిన ప్రజలు కాబోయో సీఎం వైఎస్ జగన్.. అద్దంకి ఎమ్మెల్యే చిన హనిమిరెడ్డి, ఫ్యాన్ గుర్తుకే మీ ఓటు అంటూ ప్లకార్డులు పైకి చూపుతూ నినాదాలు చేసుకుంటూ వెళ్లారు. విజయ చిహ్నాలు చూపిస్తూ మోటారు బైకులకు రెండు వైపులా జెండాలు ఏర్పాటు చేసుకుని ఉరిమే ఉత్సాహంతో సభ వద్దకు వెళ్లారు.

భుజం తట్టిన సీఎం..

సిద్ధం సభకు హాజరయ్యేందుకు రాష్ట ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెలికాప్టర్‌లో వచ్చారు. అక్కడ ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ దిగిన సీఎం వైఎస్ జగన్‌కు అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి స్వాగతం పలికారు. స్వాగతం పలికిన నాయకులతో ముచ్చటించారు. సభ ముగిసిన తరువాత హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న సీఎం వైఎస్ జగన్, చిన హనిమిరెడ్డిని భుజం తట్టారు.

సీఎం జగనన్న దీవెనతో ఎమ్మెల్యేనవుతా..

సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దీవెనలతో అద్దంకి ఎమ్మెల్యేగా తనను చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. సిద్ధం సభకు వచ్చిన ప్రజా సందోహంతో ప్రతిపక్షాల్లో వణుకు పుట్టింది. మొదట్లో నేను ఇక్కడకు వచ్చినప్పటికీ ఇప్పటికీ చాలా మార్పు వచ్చింది. నియోజకర్గ ప్రజలు, కార్యకర్తలు, నాయకులు నన్ను ఆదరిస్తున్నందుకు ధన్యవాదాలు. సిద్ధం సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

– పానెం చిన హనిమిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త, అద్దంకి

గీతాంజలి స్మృతిలో కొవ్వొత్తుల ర్యాలీ



ర్యాలీలో ఎంపీ నందిగం, ఎమ్మెల్యే అన్నాబత్తుని, ఎమ్మెల్సీలు సునీత, కల్యాణి, గీతాంజలి భర్త

తెనాలిరూరల్: గీతాంజలి అనే పేదింటి మహిళను టీడీపీ, జనసేన రాబందులు పొట్టబెట్టుకున్నాయని వైఎస్సార్ సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న ట్రోలింగ్‌తో మనస్తాపం చెంది తెనాలికి చెందిన గొల్తి గీతాంజలి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం పట్టణంలో కొవ్వొతుల ర్యాలీ నిర్వహించారు. గీతాంజలి భర్త బాలచంద్రతో కలసి వారి ఇంటి వద్ద నుంచి కొత్త వంతెన వరకు ర్యాలీగా వెళ్లి ఆమె చిత్ర పటం వద్ద అంజలి ఘటించారు. మృతురాలి కటుంబానికి రాష్ట ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మహిళా కమిషన్ మాజీ చైర్మన్ వాసిరెడ్డి పద్మ, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీలు పోతుల సునీత, వరుదు కళ్యాణి, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా, మీడియా కోఆర్డినేటర్ సజ్జల భార్గవ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా కన్వీనర్ బూరెల నాంచారమ్మ, ప్రసాదం బాల గురవమ్మ, కె.నిర్మల ఈశ్వర్, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌లు రజని, సుమ పాల్గొన్నారు.

కారకులకు కఠినంగా శిక్ష పడాలి

తెనాలి: తమకు ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదని గీతాంజలి భర్త గొల్తి బాలచంద్ర స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం తనను పరామర్శించటానికి వచ్చిన రాష్ట మంత్రి విడదల రజిని, ఎంపీ నందిగం సురేష్, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ సజ్జల భార్గవ, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీలు పోతుల సునీత, వరుదు కళ్యాణితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంటి స్థలం రావటంతో తానెంతో పొంగిపోయిందని గీతాంజలి గురించి చెప్పారు. రాత్రంతా ఫోన్ చూస్తూ ఉండటాన్ని చూశాను. ఇక్కడే ఒక ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా జాబ్ వచ్చింది తనకు. అందుకోసం ఏదైనా తయారవుతుందేమోనని అనుకున్నా...తర్వాత ఎందుకో అనుమానం వచ్చి ఫోన్ తీసుకుని చూశాను. రెండు పోస్టులు చూడగానే నాకు చాలా బాధనిపించింది. చూడలేక వదిలేశాను. చివరికిలా చేసుకుంది. ఎవరికీ ఇలాంటి బాధ రాకూడదు. గీతాంజలి మరణానికి కారకులకు కఠినంగా శిక్ష పడాలి. ఇంకో కుటుంబం తమలా వీధినపడకూడదని స్పష్టంగా చెప్పారు.

ఎన్నికల విధులకు సన్నద్ధంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందే విధుల నిర్వహణకు ప్రణాళికాబద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఎన్నికల నోడల్ అధికారుల సమావేశం మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో 16 విభాగాలు తమ విధులు సంపూర్ణంగా నెరవేర్చి ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు తోడ్పడాలని కోరారు. పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు రెండు విడతలుగా శిక్షణ తరగతులు నిర్వహించడానికి రిటర్నింగ్ అధికారులతో మాట్లాడి షెడ్యూల్ తయారు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం




మేదరమెట్లలో జగనన్న ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న సమన్వయకర్త చిన హనిమిరెడ్డి, భద్రారెడ్డి

- వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ ప్రారంభం
- జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీ
- పాల్గొన్న సమన్వయకర్త చిన హనిమిరెడ్డి, వైవీ భద్రారెడ్డి

మేదరమెట్ల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పార్టీలకు అతీతంగా టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆయన సోదరుడు వైవీ భద్రారెడ్డి గ్రామాభివృద్ధి కోసం పనిచేశారని నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలో మంగళవారం రాత్రి పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి చిన హనిమిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సమన్వయకర్త మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీని ఇక్కడ ప్రారంభించుకోవడం అభినందనీయమన్నారు. తమ సొంత నిధులతో పాటు గ్రామస్తులు అందజేసిన రూ.20 లక్షలు లైబ్రరీని సర్వాంగ సుందరంగా నిర్మించడంతోపాటు వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆ ప్రాంగణంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గతంలోనే రూ.2 కోట్ల ఖర్చుతో వైద్యశాలను నిర్మించి అందులో అధునాతన వసతులతో ప్రజలకు అందుబాటులో ఉంచారని గుర్తు చేశారు. రూ.40 లక్షలతో సెంట్రల్ లైటింగ్ సిస్టం, రూ.కోట్లతో టీటీడీ కల్యాణ మండపం, మేదరమెట్ల నుంచి సోమవరప్పాడు వరకు సీసీ రోడ్డు, పశువైద్యశాలను నాట్కో ఫార్మా కంపెనీ నుంచి సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి రూ.40 లక్షలు ఇప్పించారన్నారు. రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ. 6 కోట్లు, ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేసేందుకు గాను రూ.3.20 కోట్ల నిధులను మంజూరు చేయించడంలో వైవీ చొరవ ఉందన్నారు.

వైవీ సుబ్బారెడ్డి చొరవ మరువలేనిది..

మాజీ ఏఎంసీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఇంటి స్థలాలు లేక ఇబ్బందులు పడిన పేదలకు జగనన్న ప్రభుత్వంలో ఇంటి పట్టాలు పొందటంతో ఎంతోమంది నిరుపేదలు ఆనందంగా ఉన్నారని చెప్పారు. పార్టీలకు, కులాలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడింపించడంతోపాటు వారికి అండగా నిలుస్తామని భద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా డిజిటల్ లైబ్రరీ, సచివాల భవనం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను, ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి ప్రారంభించారు. తొలుత సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సర్పంచి బొనిగల ఎలీశమ్మ, నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు టి.వెంకటరమణమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ పులికం కోటిరెడ్డి, మాజీ వైస్ చైర్మన్లు కోయి అంకారావు, వై.రత్నారెడ్డి, శింగరకొండ మాజీ అధ్యక్ష్యుడ కోట శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ అద్దంకి పట్టణం అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, ఈదా శ్రీనివాసరెడ్డి, రామిరెడ్డి ఆదిరెడ్డి, పోకూరి బల్లబ్బాయి, మాజీ సర్పంచ్ జజ్జర ఆనందరావు, వైస్ ఎంపీపీ నరేష్‌కుమార్, తహశీల్దార్ సుశీల, ఎంపీడీవో సమత వాణి, ఏవో శ్రీనివాసరావు, డాక్టర్ నిఖిలా రెడ్డి పాల్గొన్నారు.



మేదరమెట్లలో డిజిటల్ లైబ్రరీ వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

పది పరీక్షలకు పదండిలా..!

- మార్చి 18 నుంచి ప్రారంభం
- 108 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- మౌలిక వసతులపై అధికారుల కసరత్తు

బాపట్ల టౌన్: పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వం విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది. అందుకు అనుగుణంగా పాఠశాలల్లో బోధన పద్ధతులు మెరుగుపరిచారు. మార్చి 18 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల నిర్వహణపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 16,906 మంది రెగ్యులర్ విద్యార్థులు, 2004 మంది సప్లమెంటరీ విద్యార్థులు మొత్తం 18,910 మంది పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. ఇప్పటికే విద్యార్థుల పరీక్షల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్ ఉండేలా పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

ఇంగ్లిష్ మీడియం విద్యార్థులే అధికం

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంగ్లిష్ మీడియానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిన విషయం తెలిసిందే. 2024లో ఎస్ఎస్‌సీ పరీక్షలకు హాజరవుతున్న వారిలో ఎక్కువ మంది ఇంగ్లిష్ మీడియం విద్యార్థులే ఉన్నారు.

విద్యార్థులూ... వీటిని పాటించండి

- ఉదయం 8.30 గంటల కల్లా కచ్చితంగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి
- ఉదయం 8.45 నుంచి 9.30 వరకు కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 9.30 తరువాత గేట్లు మూసి వేసిన తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు.
- హాల్ టికెట్లు పొందిన విద్యార్థులు దానిపై ముద్రించిన తమ వివరాలు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, రాయాల్సిన సబ్జెక్టులు, పరీక్ష కేంద్రం పేరు, చిరునామా సరి చూసుకోవాలి. వాటిలో ఏమైనా తప్పులు ఉన్నట్లయితే ముందుగానే తాము చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా ప్రభుత్వ పరీక్షల విభాగం దృష్టికి తీసుకెళ్లి, సరి చేయించుకోవాలి.
- క్వశ్చన్ పేపర్‌పై ఏడు అంకెలతో కూడిన ప్రత్యేక కోడ్ ముద్రిస్తోంది. హాల్ టికెట్‌పై ఉన్న ఎన్‌రోల్‌మెంట్ నంబరు ఆధారంగా కేటాయించిన రూముల వారీగా విద్యార్థులను కూర్చోబెడతారు. బార్ కోడింగ్ విధానంలో రూపొందించిన ఓఎంఆర్ షీట్లను విద్యార్థుల రోల్ నంబరు ఆధారంగా పంపిణీ చేస్తారు.
- రోల్ నంబరు ఆధారంగా విద్యార్థి తనకు కేటాయించిన సీట్లో కూర్చున్న తరువాత ఇన్విజిలేటర్ వచ్చి బార్ కోడింగ్‌తో కూడిన ఓఎంఆర్ షీట్, ప్రశ్న పత్రం, ఆన్సర్ బుక్‌లెట్ అందజేస్తారు. ఓఎంఆర్ షీట్ పూరించే విధానంపై ఇన్విజిలేటర్ ఇచ్చే సూచనలు పాటిస్తూ జాగ్రత్తగా పూరించాలి. దానిపై అనవసరమైన గీతలు, రాతలు రాయరాదు.
- ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమైన తరువాత, మధ్యాహ్నం 12.45 గంటలకు పరీక్ష ముగిసే వరకు విద్యార్థులను బయటకు వెళ్లనివ్వరు. గుర్తింపు కార్డు కలిగి, పరీక్షల విధుల్లో ఉన్న అధికారులు, స్క్వాడ్ బృందాలను పరీక్ష కేంద్రాల్లోకి తనిఖీలకు అనుమతిస్తారు.

జిల్లా సమాచారం

రెగ్యులర్ విద్యార్థులు	16,906
సప్లమెంటరీ విద్యార్థులు	2004
బాలురు	8584
బాలికలు	8322
పరీక్ష కేంద్రాలు	108
తెలుగు మీడియం విద్యార్థులు : 4094	
ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు : 12,812	

క్లుప్తంగా

డాక్టర్ షమ సుల్తానాకు బిజినెస్ నెట్‌వర్క్ అవార్డు

గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన సీనియర్ గైనకాలజిస్ట్, హోప్‌విన్ హాస్పటల్స్ అధినేత డాక్టర్ షమ సుల్తానాకు బిజినెస్ నెట్‌వర్క్ అవార్డు లభించింది. ఉమెన్స్ డేను పురస్కరించుకుని గుంటూరులో వెల్‌కమ్ హోటల్‌లో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో సిగ్నరోస్ సంస్థ వారు అతి తక్కువ ఫీజుకే కార్పొరేట్ వైద్య సేవలను అందిస్తున్నందుకు డాక్టర్ షమ సుల్తానాకు అవార్డు అందజేశారు. అవార్డు అందుకున్న షమసుల్తానాకు సీనియర్ లెప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్, గైనకాలజిస్ట్ వైద్యుల సంఘం నాయకులు అభినందనలు తెలిపారు.

హోమ్‌గార్డు భార్యకు ఆర్థిక సాయం

రూ.5లక్షల నగదు చెక్కు అందజేసిన ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి



నరసరావుపేట: అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు కుటుంబానికి తమ ఒక్కరోజు వేతనాన్ని అందించి, అండగా నిలిచిన హోంగార్డులు అభినందనీయులని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పిడుగురాళ్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గతేడాది అనారోగ్యంతో మృతిచెందిన హోమ్ గార్డు సీహెచ్ మరియదాసు భార్య రత్నకుమారికి రూ.5లక్షల నగదు చెక్కును ఆర్థిక సాయంగా ఎస్పీ అందజేశారు. ఏఆర్‌డీ ఎస్‌పీజీఎం గాంధీ, ఆర్ఐ ఎస్.కృష్ణ ఉన్నారు.

15న వినుకొండలో మినీ జాబ్ మేళా

నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో డిపార్ట్ మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15న వినుకొండలోని ఏపీ ఎస్ఎస్‌డీసీ స్కిల్ హబ్ ఎస్‌జీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాలో ఇన్నో సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రదక్షణ ఫిన్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ పూర్తిచేసిన 35 సంవత్సరాల వయస్సు లోపు గల నిరుద్యోగులు నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని తెలిపారు. వివరాలకు డి.జానీబాషా 99512 14919, ఎం.వీరాంజనేయులు 91602 00652 నెంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

- నియోజకవర్గ సమన్వయకర్త బాలాజీ
- పర్చూరులో ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు

పర్చూరు (చినగంజాం): వైఎస్సార్ సీపీ పేదల అభ్యున్నతి కోసమే పుట్టిన పార్టీ అయితే సీఎం వైఎస్ జగన్ పేదల పక్షపాతిగా చరిత్రలో నిలిచిపోతారని పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ అన్నారు. మంగళవారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పర్చూరు పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా పర్చూరు బొమ్మల సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి బాలాజీ పూలమాల వేసి నివాళులర్పించారు. కాపు ఉద్యమ నాయకుడు వంగవీటి మోహనరంగా, భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో పార్టీ జెండా ఆవిష్కరించి, పార్టీ 14వ వార్షికోత్సవ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ ప్రతి సంక్షేమ పథకాన్ని పేద,



మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బాలాజీ

బడుగు, బలహీన వర్గాలకు చేర్చేందుకు పూర్తి బాధ్యత తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ వార్షికోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలో నష్టపోయిన ప్రతి పార్టీ కార్యకర్తకు అందుబాటులో ఉంటూ వారిని ఆదుకుంటానన్నారు. సీఎం జగన్ తనను పర్చూరు నియోజకవర్గానికి పంపించి వైఎస్సార్ సీపీ కుటుంబాన్ని అప్పగించారన్నారు. ప్రభుత్వం ప్రతి నెల రెండు సంక్షేమ పథకాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అగ్ర కులాలలోని పేద వర్గాలకు అందజేసిందని, 99 శాతం ప్రతి ఇంటికీ సంక్షేమ పథకం అందిందని అన్నారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా 6.12 లక్షల ఉద్యోగాలు, నాడు నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలకు రూ.75 వేల కోట్లు, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.35 వేలు కోట్లు ఖర్చు చేసి పేద వర్గాలను ఆదుకున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కఠారి అప్పారావు, బండారు ప్రభాకరరావు, మున్నం నాగేశ్వరరెడ్డి, దండా చౌదరి ,పఠాన్ కాలేషవలి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జేసీఎస్ కన్వీనర్‌లు, సర్పంచ్‌లు, వార్డుమెంబర్‌లు, సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అడిషనల్ ఎస్పీ మహేష్ సేవలు మరువలేనివి

పోలీసు అధికారుల వీడ్కోలు సభలో ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: నేరాల నియంత్రణలో జిల్లా అడిషనల్ ఎస్పీ పి. మహేష్ చూపిన చొరవ మరువలేనిదని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వర్తించి బదిలీపై విశాఖపట్నం క్రైమ్ ఏసీపీగా వెళ్లిన పి.మహేష్ తో పాటు బాపట్ల డీఎస్పీగా విధులు చేపట్టి మైదుకూరు డీఎస్పీగా బదిలీపై వెళ్లిన టి.వెంకటేశులు, చీరాల డీఎస్పీగా పనిచేసి ఇంటెలిజన్స్ విభాగానికి బదిలీపై వెళ్లిన ఎస్. ప్రసాదరావు, బాపట్ల ఎస్‌బీ సీఐగా పనిచేసి ప్రకాశం సోషల్ మీడియా విభాగానికి బదిలీపై వెళ్లిన వి.సూర్యనారాయణలను మంగళవారం ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. అనంతరం ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ బాపట్ల నూతన జిల్లాగా ఏర్పడిన సుమారు నెల రోజుల తరువాత అడిషనల్ ఎస్పీ మహేష్ జిల్లాకు



బదిలీపై వెళ్లిన అడిషనల్ ఎస్పీ, బాపట్ల డీఎస్పీలను సన్మానిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

నియమితులయ్యారన్నారు. అప్పటి నుంచి జిల్లా సెబ్ విభాగం, అడ్మిన్ విభాగాలను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. జిల్లాలో శాంతి భద్రతలను పరిరక్షించటంలో మంచి సహకారం అందించారన్నారు. బాపట్ల, చీరాల డీఎస్పీలు అంకిత భావంతో విధులు నిర్వహించేవారన్నారు. సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో విశేషంగా కృషి చేశారన్నారు.

ఆడపిల్ల లేకపోవడాన్ని దురదృష్టంగా భావించాలి



నరసరావుపేట: కంటే కూతుర్నే కనాలని, ఇంట ఆడపిల్ల కలగకపోవడాన్ని దురదృష్టంగా భావించాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు. ప్రకాష్ నగర్ షాదీఖానాలో మంగళవారం మహిళా దినోత్సవం యుటీఎఫ్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ, ప్రజాతంత్ర మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివ కుమారి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ శివశంకర్ మాట్లాడారు. మహిళ ఆకాశమే హద్దుగా అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని, సమాజంలో తమకంటూ ఓ ప్రత్యేక హోదా, గుర్తింపు కలిగేలా అడుగులు వేస్తున్నారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని సూచించారు. మహిళలు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత శిఖరాల వైపు పయనించాలని ఆకాంక్షించారు. జిల్లా జీసీడీఓ డి.రేవతి మాట్లాడుతూ.. విద్యతోనే మహిళల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఆ దిశగా మహిళలు ముందుకు సాగాలన్నారు. ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి పెద్దిరాజు మహిళలకు స్ఫూర్తినిచ్చేలా ఉద్యమ గేయాలు ఆలపించారు. మహిళా సంఘాల నాయకులు గద్దె ఉమశ్రీ, గుంటుపల్లి రజిని, యూటీఎఫ్ నాయకురాలు బాగేశ్వరిదేవి, గుంటూరు మల్లేశ్వరి, కేపీ మెటిల్డాదేవి, సీఐటీయూ నాయకులు ఆంజనేయ నాయక్, బాలోత్సవాల కమిటీ జిల్లా కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మహాక్షేత్రంగా చామర్రు వర్ధిల్లుతుంది

సచ్చిదానంద తపోవనం పీఠాధీశ్వరులు సచ్చిదానంద భారతీస్వామి

అచ్చంపేట: గ్రామాల్లోని దేవాలయాలు జీర్ణోద్ధరణకు గురికాకుండా ఆధునీకరించడం చాలా ముఖ్యమని, రాబోయే రోజుల్లో పవిత్ర కృష్ణానది ఒడ్డునగల చామర్రు గ్రామం మహాక్షేత్రంలా వర్ధిల్లుతుందని సచ్చిదానంద తపోవనం పీఠాదీశ్వరులు శ్రీశ్రీశ్రీ సచ్చిదానంత భారతీస్వామి పేర్కొన్నారు. దేవాలయాల దశమ వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండవరోజు సచ్చిదానంత భారతీ స్వామి పాల్గొని, భక్తులకు సందేశమిచ్చారు. చామర్రులాంటి కుగ్రామంలో ఉన్నటువంటి దేవాలయాలను నూతనత్వం ఉట్టిపడే విధంగా తీర్చిదిద్దిన నిర్వాహకులను అభినందనీయులన్నారు. శ్రీ వరసిద్ధి వినాయక, నాభిశిల, శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి, అభయాం



ప్రవచనమిస్తున్న సచ్చితానంద భారతీస్వామి

జనేయస్వామి, పోలేరమ తల్లి దేవాలయాలను ఒకే రోజు పునరుద్దరించి క్రమం తప్పకుండా పదేళ్ల నుంచి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తుండటంతో గ్రామం సుభిక్షంగా ఉంటుందని చెప్పారు. గ్రామస్తులంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లుతారని ఆశీర్వదించారు. వినాయక స్వామి ఎదుకోల ఉత్సవాలు ఎంతో ఆకట్టుకున్నాయి. కల్యాణ గీతాలాపనలతో ఉత్సవాలు ఆద్యంతం రక్తికట్టించాయి.

తనిఖీలకు అడ్డుపడ్డ గ్రానైట్ క్వారీ యజమాని

తనిఖీలను విరమించి వెనుదిరిగిన అధికారులు

మార్టూరు: మైనింగ్, విజిలెన్స్ అధికారులు గ్రానైట్ ఫ్యాక్టరీలలో తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఏడీ ప్రతాపరెడ్డి, మైనింగ్ ఏడీ బాలాజీనాయక్‌ల వివరాల మేరకు.. ఉన్నతాధికారుల ఆదేశాలతో 14 మంది సిబ్బందితో క్వారీలు, గ్రానైట్ ఫ్యాక్టరీలలో తనిఖీ నిమిత్తం మంగళవారం ఉదయం మార్టూరు వచ్చారు. అందులో భాగంగా జొన్నతాళి గ్రామ సమీపంలోని కామేపల్లి లక్ష్మీప్రసాద్‌కు చెందిన కామేపల్లి గ్రానైట్ ఫ్యాక్టరీలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. అక్కడ ఉన్న ముడి రాయి, స్లాబ్‌ల కొలతలు తీసుకున్నారు. అనంతరం సమీపంలో ఉన్న లక్ష్మీప్రసాద్‌కే చెందిన మరో ఫ్యాక్టరీలో అధికారులు తనిఖీ కోసం ప్రయత్నించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న ఫ్యాక్టరీ యజమాని లక్ష్మీప్రసాద్ తన మనుషులతో అధికారులకు అడ్డంగా తమ వాహనాలు అడ్డుపెట్టి



అధికారులతో వాగ్వాదానికి దిగిన గ్రానైట్ క్వారీ యజమాని లక్ష్మీప్రసాద్

ఘర్షణకు దిగారు. తన ఫ్యాక్టరీలను మాత్రమే తనిఖీ చేయడం ఏమిటంటూ అడ్డుకున్నారు. ఈ క్రమంలో అధికారులు తనిఖీలను తాత్కాలికంగా విరమించి తిరిగి వెళ్లారు. జరిగిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు ఏడీ ప్రతాపరెడ్డి తెలిపారు.

గీతాంజలి ఆత్మహత్య కారకులను కఠినంగా శిక్షించాలి

నియోజకవర్గ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: జగనన్న పాలనలో తనకు నివేశన స్థలం వచ్చిందని చెప్పుకొని ఆనందాన్ని వ్యక్తం చేసిన తెనాలికి చెందిన గీతాంజలి ఆత్మహత్యకు కారకులైన టీడీపీ, జనసేన సోషల్ మీడియా బాధ్యులను శిక్షించాలని నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి డిమాండ్ చేశారు. గీతాంజలి మృతికి సంఘీభావంగా మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బంగ్లా రోడ్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఆనందంగా ఉండటాన్ని కూడా టీడీపీ, జనసేన పార్టీలు సహించలేక పోతున్నాయన్నారు. గీతాంజలిపై అసభ్యకరంగా ట్రోల్ చేసి ఆమె మరణానికి కారణమవటం దారుణమన్నారు. స్త్రీలను,



ర్యాలీలో పాల్గొన్న సమన్వయకర్త చిన హనిమిరెడ్డి, మహిళలు

మహిళా కార్యకర్తలను వేధించడం టీడీపీకి వెన్నతో విద్యని విమర్శించారు. సోషల్ మీడియాలో టీడీపీ, జనసేన చేస్తున్న అరాచకాలు అన్నీ ఇన్నీ కావన్నారు. ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన మహిళను టార్గెట్ చేసి వేధించడం ప్రతి పక్షాలకు మామూలైందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మహిళల ఆశీర్వాదాలతో గెలుపు ఖాయం



మహిళలకు నమూనా చెక్కు అందజేస్తున్న చిన హనిమిరెడ్డి అధికారులు

- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి
- సిద్ధం సభకు వచ్చిన జనం విషయంలోనూ అక్కసు
- వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ

అద్దంకి: మహిళలు ఆశీర్వదిస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇక్కడ ఎమ్మెల్యేగా నేను విజయం ఖాయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వైఎస్సార్ చేయూత నాలుగో విడత చెక్కుల పంపిణీ మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గంలోని 15,000 మందికి రూ.105 కోట్ల నమూనా చెక్కును అందజేశారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి అక్క చెల్లెమ్మ నవ్వుతూ ఉండాలనే ఉద్దేశంతో పథకాలు ప్రవేశపెట్టి నేరుగా లబ్ధిని బటన్ నొక్కి వారి ఖాతాలకే జమ చేస్తున్నారని చెప్పారు. ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా, దళారీ వ్యవస్థను రూపుమాపాడని చెప్పారు. టీడీపీ హయాంలో పథకాల అమలు అవినీతి మయం అని పేర్కొన్నారు. గత ఏ ప్రభుత్వ హయాంలోనూ, ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి విధానాన్ని ప్రవేశపెట్టలేదన్నారు. ఇంత మేలు జరగడం కోసం ఆయన్ను మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

తెలుగుదేశం అంటేనే అరాచకం..

గీతాంజలి అనే ఆడబిడ్డ తనకు జరిగిన మేలు చెప్పుకుంటే ఆమె ఆత్మహత్య చేసుకునే వరకూ టీడీపీ, జనసేన ఉన్మాదులు ఊరుకోలేదని సమన్వయకర్త పాలెం చిన హనిమిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీని గెలిపిస్తే ఇటువంటి అరాచకాలు ఎన్నో జరుగుతాయని, గతంలోనూ జరిగాయని గుర్తు చేశారు. ఏదైనా చేయగలిగిన సత్తా బాబు మనుషులకు ఉందన్నారు. వైఎస్సార్ సీపీని గద్దె దించడం కోసం ముగ్గురు మొనగాళ్లు ఏకమయ్యారని ఎద్దేవా చేశారు. చివరకు సిద్ధం సభకు వచ్చిన జనం సంఖ్య చెప్పడంలోనూ అక్కసు వెళ్లగక్కి తక్కువగా వచ్చినట్లు అబద్ధాలు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 18 లక్షల మంది వచ్చినట్లు ఇండియా టుడే రాసిన విషయం ఉటంకించారు. మళ్లీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకుని తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే అసెంబ్లీలో మన ప్రాంత ప్రజల సమస్యలు వినిపిస్తానన్నారు. డీఆర్‌డీఏ పీడీ సీహెచ్ కృష్ణ మాట్లాడుతూ జిల్లాలో 88,055 మందికి రూ.604 కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. తరువాత మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, అవిశెన ప్రభాకర్‌రెడ్డి, కొల్లా భువనేశ్వరి, మాజీ ఏఎంసీ చైర్మన్ పులికం కోటిరెడ్డి, పీడీ డీఆర్‌డీఏ సీహెచ్ కృష్ణ ప్రసంగించారు. చివరగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రూ.5.1 కోట్ల చెక్కును మహిళా సంఘాలకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్ కే అనంతలక్ష్మి, మాజీ నరసింహస్వామి దేవాలయ చైర్మన్ జువ్వి రాము, మెప్మా సీఎంఎం ఫణికుమారి, ఏరియా కోఆర్డినేటర్ రవికుమార్ పాల్గొన్నారు.

నవరత్నాలతో బీసీలకు ఆర్థిక పరిపుష్టి



మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.మారేష్

తెనాలి: సోషల్ మీడియాలో ట్రోలింగ్‌లకు మానసికంగా ఎంత నరకయాతన అనుభవించి ఉంటే ఇద్దరు చిన్నపిల్లలను మరిచిపోయి గీతాంజలి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని ఆంధ్రప్రదేశ్ బీసీ కమిషన్ సభ్యుడు డాక్టర్ ఎన్.మారేష్ అన్నారు. ఇంతగా వ్యక్తిత్వ హననానికి పాల్పడటానికి గీతాంజలి చేసిన తప్పేమిటని ప్రశ్నించారు. ఐటీడీపీ, జనసేన సోషల్ మీడియా ట్రోలింగ్‌కు మానసిక వ్యధకు గురై ఆత్మహత్యకు పాల్పడిన గొల్తి గీతాంజలి కుటుంబాన్ని మంగళవారం సాయంత్రం డాక్టర్ మారేష్, కమిషన్ సహ సభ్యుడు కుందుర్తి గురవాచారి, బీసీ, విశ్వబ్రాహ్మణ సంఘాల నేతలతో కలిసి పరామర్శించారు. అనంతరం డాక్టర్ మారేష్ మీడియాతో మాట్లాడుతూ, గీతాంజలికి జరిగిన ఘోరానికి బీసీ వర్గాలన్నీ దిగ్భ్రాంతికి గురైనట్టు చెప్పారు. ప్రభుత్వం అందించిన లబ్ధిని చెప్పటమే పాపమా? అని ప్రశ్నించారు. వాస్తవానికి రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న నవరత్నాలతో బీసీలు ఆర్థికంగా ఎదిగారని చెప్పారు. ఈ క్రమంలోనే లబ్ధిదారు గీతాంజలి ఆ విషయాన్ని సంతోషంగా చెప్పటం, కీచకుల్లా ఆమెపై సోషల్ మీడియాలో ట్రోల్ చేయటం హేయమైందని అన్నారు. గీతాంజలి మాట్లాడిన మాటల్ని వక్రీకరించి అసభ్య పదజాలంతో వేధించటం దారుణమన్నారు. కారకులు ఎవరైనా, వారి వెనుక ఎంతవారున్నా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీసీ కమిషన్ సభ్యుడు కుందుర్తి గురవాచారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ జాతి ముద్దుబిడ్డ గీతాంజలి మృతికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించటం ఊరటగా ఉందన్నారు. బీసీ సంఘాలు ఐక్యంగా ఉండి ఇలాంటి దారుణాలు జరక్కుండా చూడాలన్నారు. ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ ఉద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 25 లక్షల విశ్వబ్రాహ్మణ సంఘీయులు ఉన్నట్టు చెప్పారు. గీతాంజలికి జరిగిన దారుణాన్ని ముక్తకంఠంతో ఖండిస్తున్నామని చెప్పారు. కారకులను కఠినంగా శిక్షించాలన్నారు. పిల్లల భవిష్యత్‌కు ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు వేముల బేబీరాణి, జాయింట్ సెక్రటరీ బండ్లమూడి రోజారాణి, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి జక్కా శ్రీనివాసయాదవ్, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అంగలకుదురు సుశీల మాట్లాడారు.

ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన వైఎస్సార్ కుటుంబం

నరసరావుపేట : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగులకు మేలు జరిగిందంటే అది వైఎస్సార్ కుటుంబం వల్లేనని ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి పాలిమేర వెంకటరెడ్డి, ముప్వా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు వారు మంగళవారం స్థానికంగా విలేకర్లతో మాట్లాడారు. గతంలో ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి సొసైటీల ఉద్యోగులకు దీంతో జీతాలు పెంపు, పీఎఫ్, గ్రాడ్యూటీ లాంటి సౌకర్యాలను కల్పిస్తూ 2009లో 151 జీవో ఇచ్చి, జాబ్ గ్యారెంటీ గుర్తింపును ఇచ్చారని గుర్తుచేశారు. అర్హత గల ఉద్యోగులను జిల్లా బ్యాంకుల్లో ఐదో తరగతి ఉద్యోగులుగా నియమించుకోవాలని అప్పటి సహకార శాఖ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి క్యాబినెట్ సబ్ కమిటీ ద్వారా అవకాశం కల్పించారని తెలిపారు. 2020 డిసెంబర్‌లో సొసైటీ ఉద్యోగులందరికీ హెచ్ఆర్ పాలసీ వర్తింపజేయాలని జీవో నంబరు 90ని సీఎం వైఎస్ జగన్ విడుదల చేశారన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 2,051 సహకార సంఘాల్లో పని చేస్తున్న 5,843 మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూరిందని వివరించారు. తాజాగా అన్ని సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు 138.30 డీఏ రేట్లను వర్తింపజేయాలని ఈ నెల 11న గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, మూడు జిల్లాల డీసీవోలు ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. వైఎస్సార్ కుటుంబం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 5,843 ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నిండాయని యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పేర్కొన్నారు.

ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ భాస్కరరావు



డాక్టర్ భాస్కరరావు



డాక్టర్ స్వరూప్‌కాంత్

గుంటూరు మెడికల్: గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ గుంటూరు జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశాల అధ్యక్షుడిగా జీజీహెచ్ పీడియాట్రిక్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ చందా భాస్కరరావు మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జీజీహెచ్ శుశ్రుతహాలులో మంగళవారం నూతనంగా ఎన్నికైన ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం ఎన్ని యూనియన్ లు పెట్టినా అభ్యంతరం లేదన్నారు. ప్రభుత్వ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సంఘం కార్యదర్శిగా జీజీహెచ్ ఈఎన్‌టీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి. స్వరూప్‌కాంత్, కోశాధికారిగా ఎనస్తీషియా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. ఇందిరా ప్రియదర్శిని ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సెంట్రల్ అబ్జర్వర్ డాక్టర్ బాబ్జి శ్యాంకుమార్ మాట్లాడుతూ తమ సంఘానికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్న ఇతర యూనియన్ నేతలు తమ సంఘ గుర్తింపు పత్రాలు, సభ్యుత్వ నమోదు పత్రాలు బహిరంగంగా చూపించాలని సవాల్ విసిరారు. రాష్ట్ర విభజనకు పూర్వం సభ్యుల నుంచి వసూలు చేసిన రూ.3 కోట్లు ఇతర జమా ఖర్చుల వివరాలు బహిర్గంతం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ బి. శైలజ , డాక్టర్ ఉప్పాల శ్రీనివాస్, ఏపీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జీజీహెచ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.